క్లుప్తంగా

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

కంచికచర్ల: దసరా సెలవులు మంగళవారంతో ముగియటంతో ఈ నెల 25వ తేదీ బుధవారం నుంచి ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయని ఎంఈఓ బి.బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సమయ పాలన పాటించి పాఠశాలలకు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వత్సవాయి: ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయ భాను సూచించారు. పలువురికి ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన అందజేశారు. వత్సవాయి గ్రామానికి చెందిన భూక్యా సక్కుబాబుకి రూ.65 వేలు సజ్జనపు కోటేశ్వరమ్మకు రూ.58 వేలు, మంగొల్లు గ్రామానికి చెందిన పెద్దినేని నరసింహారావుకు రూ.1.50 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుత్తా శంకరరావు, జిల్లా కార్యదర్శి గాదెల రామారావు, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు రణ్‌హుస్సేన్, మంగొల్లు గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ అన్నెపాక నరసింహారావు, రాజానాయక్, రమాకాంత్, చిట్టూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షిరిడీ సాయి సమాధి ఉత్సవం

నందిగామ: స్థానిక రామలింగేశ్వర నగర్‌లో ఉన్న సాయి అయ్యప్ప ఆలయంలో సోమవారం సమాధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. షిరిడీ సాయినాథుడు సమాధిలోకి వెళ్లిన రోజును పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రధానంగా 105 వ సమాధి ఉత్సవం సందర్భంగా ఆలయంలోని బాబా విగ్రహం ఎదుట పూలతో సమాధి ఆకారాన్ని తయారుచేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంధ్యలలో స్వామి వారికి ప్రత్యేక హారతులు ఇవ్వటంతో పాటు సాయం సంధ్యా సమయంలో పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెండు గ్రామాల్లో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌లు



నందిగామ(చందర్లపాడు): గ్రామాలలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి అన్నారు. నందిగామ మండలం పెద్దవరం సమీపంలో గల క్రాస్ బయోటెక్స్ సౌజన్యంతో చందర్లపాడు మండలం కోనాయపాలెం, కాండ్రపాడు గ్రామాల్లో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌లను మంగళవారం కంపెనీ డైరెక్టర్ లెనిన్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.60 వేలు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీ తిరుపతమ్మ వారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి మంగళవారం మండలంలోని అనిగండ్లపాడు గ్రామానికి చెందిన కందిమళ్ల వెంకట సుబ్బారావు, చిలకమ్మ దంపతులు రూ.60 వేల విరాళాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణ మోహన్ చేతుల మీదుగా అందజేశారు. గ్రామానికే చెందిన వడ్డెల్లి నాగఅన్వేష్ దంపతులు రూ.15,116 అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

బతుకమ్మ వేడుకలు



గానుగపాడు(తిరువూరురూరల్): మండలంలోని గానుగపాడులో దసరా వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి బతుకమ్మ పండగ జరిపారు. గ్రామ సర్పంచ్ వేమిరెడ్డి కృష్ణవేణి ఆధ్వర్యంలో గ్రామమహిళలు, యువతులు బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు.

వైభవంగా ముగిసిన దసరా శరన్నవరాత్రులు



నందిగామ: లింగాలపాడులో బతుకమ్మలను నిమజ్జనానికి తరలిస్తున్న మహిళలు



జగ్గయ్యపేట: చిల్లకల్లు బీసీ కాలనీలో అమ్మవారికి పూజలు చేస్తున్న విప్ ఉదయభాను

నందిగామ: డివిజన్ వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా ముగిశాయి. ప్రతి రోజూ పలు రూపాల్లో దర్శనమిచ్చిన జగన్మాత తొమ్మిదో రోజు ఉదయం మహిషాసుర మర్దనిగా, సాయంత్రం రాజ రాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడు మండలాల్లోని వివిధ ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవార్లతోపాటు వివిధ కూడళ్లలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన అమ్మవార్లను తొమ్మిది రోజులపాటు భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో కొలుచుకున్నారు.

ఘనంగా శమీ పూజ

దసరా మహోత్సవాల చివరి రోజును పురస్కరించుకొని శమీ పూజ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని ముక్కోటి మండపం, కన్యక పరమేశ్వరి అమ్మవారు, రామలింగేశ్వర స్వామి ఆలయాలు, రామలింగేశ్వర నగర్‌లోని సాయి అయ్యప్ప ఆలయంలో శమీ పూజ ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి వారి ఆలయంలో శమీ పూజా కార్యక్రమం జరిగింది.

బతుకమ్మలకు ఘనంగా వీడ్కోలు

దసరా మహోత్సవాలను పురస్కరించుకుని తొమ్మిది రోజులపాటు బతుకమ్మలను తయారుచేసి వాటిని పూజించిన మహిళలు, యువతులు, బాలికలు చివరి రోజు భారీ పరిమాణంలో ఉన్న బతుకమ్మలను తయారుచేసి వాటికి భక్తి శ్రద్ధలతో మొక్కి గ్రామంలో ఊరేగించిన అనంతరం మున్నేరు, కృష్ణా నదితో పాటు ఉప నదుల్లోను, సమీపంలోని చెరువుల్లోను విడిచిపెట్టారు. పొద్దుపోయేంత వరకు ఈ కార్యక్రమం ఎంతో సందడిగా సాగింది. ఊరేగింపు సమయంలో పలుచోట్ల మహిళలు సంప్రదాయ పాటలకు నృత్యం చేసి సందడి చేశారు.

జగ్గయ్యపేటలో...

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాల వద్ద భక్తులు పోటెత్తారు. ఉదయం శ్రీమహిషాసుర మర్దనీ దేవి, మధ్యాహ్నం శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నకాశిబజారులో శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో, అద్దాలబజారులో ఉన్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో, దుర్గాపురంలో ఉన్న శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో, చెరువుబజారులో ఉన్న శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో, అద్దాల బజారులో ఉన్న శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, హోమాలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కోదాడ రోడ్‌లోని కలకత్తా కాళీమాత విశ్వరూప శివదుర్గాభవాని అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో అమ్మవార్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

జమ్మిచెట్టు వద్ద శమీ పూజలు...

స్థానిక అప్సరా థియేటర్ రోడ్డులోని జమ్మిచెట్టు వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు శమీ పూజలు నిర్వహించారు. స్థానిక నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో, అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండిదేవాలయంలో జరిగిన పూజల్లో, రథోత్సవంలో, చెరువుబజారులోని అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపులో ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, విమలాభాను దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 31 వ వార్డు ఎస్ఎస్‌పీ కాలనీలో ఏర్పాటుచేసిన మండపంలోని అమ్మవారిని ఉదయభాను దర్శించుకుని పూజలు చేశారు.

మండలంలో ముగిసిన దసరా వేడుకలు

జగ్గయ్యపేట: మండలంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు సోమవారం అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని గౌరవరం, చిల్లకల్లు, జయంతిపురం, అనుమంచిపల్లి, ముక్త్యాల గ్రామాల్లోని విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి విగ్రహాలతో పాటు జమ్మి చెట్టుకు పూజలు చేశారు. గౌరవరంలో ప్రత్యేకంగా రంగవల్లులు దిద్ది దీపాలతో అలంకరించారు. పట్టణంలోని అలాసపురివారి వీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి మహిషాసురమర్దని అలంకారం భక్తులను ఆకట్టుకుంది. చిల్లకల్లు బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనుమంచిపల్లి గ్రామంలో భ్రమరాంబిక మల్లేశ్వర స్వామి వారిని అశ్వదళ వాహనంపై ఊరేగించారు. పట్టణంలోని కోదాడ రోడ్డులోని కలకత్తా కాళీమాత ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు.

తిరుపతమ్మ ఆలయంలో...

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో జమ్మి చెట్టు కింద శమీపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పెనుగంచిప్రోలు శ్రీస్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయం, నవాబుపేటలో శివాలయం ఆధ్వర్యంలో శమీపూజ నిర్వహించారు.

వత్సవాయిలో...

వత్సవాయి: నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. సోమవారం అమ్మవారు భక్తులకు మహిషాసురమర్దనీ, రాజరాజేశ్వరి అమ్మవారుగా దర్శనమిచ్చారు. వత్సవాయిలోని వత్సవాయమ్మ తల్లి ఆలయం, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ, చిట్టేల వెంకటేశ్వరస్వామి ఆలయం, లింగాల ఉమామహేశ్వరస్వామి, మక్కపేటలో ప్రసన్నాంజనేయ, అయ్యప్ప, మంగొల్లులో రామాలయం, భీమవరంలో ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

ఊరేగింపుగా బతుకమ్మల నిమజ్జనాలు

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహిళలు సాయంత్రం సమయాల్లో రంగురంగు పూలతో అందంగా బతుకమ్మలను తయారుచేశారు. అన్నింటిని ఒకచోటకు చేర్చి మహిళలు ఆడి పాడారు. చివరిరోజున బతుకమ్మలకు పూజలు చేసి ట్రాక్టర్‌పై ఊరేగింపు నిర్వహించి మునేటిలో నిమజ్జనం చేశారు. వత్సవాయిలో విప్ సామినేని ఉదయభాను, ఎంవీఎన్ఆర్ యూత్ ఆధ్వర్యంలో బతుకమ్మలను ప్రత్యేకంగా ఊరేగించారు.

కంచికచర్లలో...

కంచికచర్ల: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు మహిషాసురమర్దనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్, జుజ్జూరు రోడ్డులో విశ్వశాంతి మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలువ పందిరిలో అమ్మవారు మహిషాషురమర్దనిగా భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. మండలంలోని గండేపల్లిలో అమ్మవారికి మున్నేటి నుంచి జలాన్ని బిందెలతో తీసుకుని గ్రామ పురవీధుల్లో ఊరేగించి ముత్యాలమ్మ అమ్మవారికి, దుర్గాదేవి అమ్మవారికి జలాభిషేకం చేశారు. భవాని మాలధారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని గొట్టుముక్కల, పరిటాల, మోగులూరు, చెవిటికల్లు, మున్నలూరు, కునికెనపాడు, పెండ్యాల, వేములపల్లి తదితర గ్రామాల్లో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలుచేశారు.

నందిగామ పోలీసుస్టేషన్‌లో ఆయుధ పూజ

నందిగామ: డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో దసరా పండుగను పురస్కరించుకుని పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. నందిగామ పోలీస్ స్టేషన్‌లో తుపాకులు, ఇతర ఆయుధాలను అమ్మవారి ముందు ఉంచి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పట్టణ సీఐ హనీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాలలో ఏసీపీ జనార్ధన్ నాయుడు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భారీ బతుకమ్మ

వీరులపాడు: విజయదశమి సందర్భంగా ఆయా గ్రామాలలోని ఆలయాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపాలలో కొలువుదీరిన అమ్మవారిని మహిషాసురమర్దని, రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని అల్లూరు గ్రామంలో సీతారామ చంద్ర స్వామి సహిత మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలు అల్లూరు భాస్కరరావు, అంజనాదేవి దంపతులు ప్రత్యేక పూజలు, హోమాది క్రతువులలో పాల్గొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో బతుకమ్మ వేడుకలను సోమవారం రాత్రి అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన భారీ బతుకమ్మలు భక్తులను, చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం బతుకమ్మలకు ప్రత్యేక పూజలు చేసి ఆట, పాటలతో భారీ బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. మండలంలోని బోడవాడ, జమ్మవరం గ్రామాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మకు పూజలు చేసి నిమజ్జనం నిర్వహించారు.



పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో శమీపూజ



నందిగామ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ జనార్ధన్ నాయుడు



వత్సవాయిలో బతుకమ్మలకు పూజలు చేస్తున్న మహిళలు



నందిగామ: అంబారుపేటలో సత్యమ్మ అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాల్లో భక్తులు



పేటలో శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో శ్రీమహిషాసుర మర్దనీదేవి అలంకరణ



పేటలో దుర్గాపురంలో శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు



నందిగామ: దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న శమీ పూజ



పెద్దాపురంలో ఏర్పాటు చేసిన భారీ బతుకమ్మలు

నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



జాబ్ మేళాలో పాల్గొన్న సౌత్ కొరియా వైఈసీ చీఫ్ అడ్వయిజర్ ఐజాక్ కిమ్, జెడ్పీటీసీ కీర్తి సౌజన్య

కంచికచర్ల: నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ మేనేజింగ్ డైరెక్టర్ అమర్లపూడి శేఖర్ అన్నారు. కంచికచర్ల ఆర్సీఎం చర్చి ఆవరణలో సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు మైండ్ ఎడ్యుకేషన్ రిక్రియేషన్ అండ్ కెరీర్ గైడెన్స్‌తో పాటు యువతకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహించామన్నారు. జాబ్‌మేళాలో కంచికచర్ల, వీరులపాడు, ఇబ్రహీంపట్నం మండలాల నుంచి వెయ్యి మందికి పైగా వచ్చారని అన్నారు. అనంతరం సీఎం జగన్ సీఎస్ఓ అమర్లపూడి జోషిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వీరులపాడు జెడ్పీటీసీ సభ్యులు అమర్లపూడి కీర్తి సౌజన్య, సౌత్ కొరియా వైఈసీ చీఫ్ అడ్వయిజర్ ఐజాక్ కిమ్, షెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పీడీ సుధీర్ కుమార్, ఎయిర్‌టెల్ డీజీఎం పి.ప్రసాద్, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ బి.దయానందం, అమర్లపూడి దాసు, కేవీ కృష్ణారావు, యువతీ యువకులు పాల్గొన్నారు.

లడ్డూ పోటు, అన్నప్రసాదాల్లో తనిఖీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసే భవానీలు, భక్తులకు అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదాలను అందజేయడంలో ఎటువంటి అలసత్వం వహించరాదని దుర్గగుడి ఈవో కేఎస్.రామారావు ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. దేవస్థాన ప్రధాన లడ్డూ పోటు, అర్జున వీధిలోని దేవస్థాన షెడ్డులోని లడ్డూ పోటులను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. విక్రయానికి సిద్ధంగా లడ్డూలను తూకం వేసి పరిశీలించారు. లడ్డూ నాణ్యత, తూకం సక్రమంగా అందించాలని ఆదేశించారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు మంగళవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని క్యూలో అమ్మవారి దర్శనానికి విచ్చేస్తున్న భక్తులతో మాట్లాడారు. తాగునీరు, ఇతర సదుపాయాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ రథం సెంటర్‌లోని అప్పన వెంకట కృష్ణయ్య ధర్మసత్రం దగ్గర మంగళవారం అన్నప్రసాద వితరణ చేశారు. లయన్స్ క్లబ్ విజయవాడ సుప్రీమ్ ఆధ్వర్యంలో క్లబ్ రిలీవింగ్ హంగర్ కార్యక్రమ రికగ్నైజ్డ్ డీసీ అప్పన వెంకట సత్యసాయి బాబు సహకారంతో 2 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్లబ్ పూర్వ గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు, శ్రీసాయి పూర్ణ ఎంటర్‌ప్రైజస్ అధినేత గోపీకృష్ణ, అన్నే సాంబశివరావు పాల్గొని అన్నప్రసాద వితరణను ప్రారంభింప చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు దసరా ఉత్సవాల పది రోజుల పాటు అన్నప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న నిర్వాహకులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో ఆలమూరి అమరనాథ్, మద్దినేని చక్రధర్, విశ్వేశ్వరరావు, సుప్రీమ్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి లాజరస్ కుమార్, కోశాధికారి నాగిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో కలెక్టర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంలో దుర్గమ్మను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన కలెక్టర్‌ను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఈవో కెఎస్.రామారావు దంపతులు కలెక్టర్ దంపతులకు అమ్మవారి చిత్రపటం,తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో దుర్గగుడి ఏఈఈవో చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేత్రదానం

తిరువూరు: స్థానిక పాతతిరువూరులో సోమవారం రాత్రి మృతిచెందిన రావి అనసూయ(85) నేత్రాలను ఆమె కుటుంబసభ్యులు ఖమ్మంలోని నేత్రనిధి ట్రస్టుకు వితరణ ఇచ్చారు. తిరువూరు లయన్స్ క్లబ్ సభ్యుల ప్రోత్సాహంతో అనసూయ కుమార్తెలు పుష్పావతి, సత్యవతి, మంగతాయారు, పద్మావతి నేత్రదానానికి అంగీకరించారు.

గోశాలకు రూ. 51వేల వితరణ

నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోని గోశాల పై కప్పు పెంకు నిర్మాణానికి ఒక భక్తుడు రూ. 51వేలు వితరణగా ఇచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామవర ప్రసాదరావు తెలిపారు. తిరువూరు పట్టణానికి చెందిన చుండ్రుపట్ల నాగేశ్వరరావు, విజయలక్ష్మీ దంపతుల కుమారుడు అజయ్ మురారి ఈ మొత్తాన్ని అర్చకులకు అందజేశారు. దాతను అర్చకులు ఆశీర్వదించారు.

రైలు ఢీకొని 5 గేదెల మృతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి రైల్వేట్రాక్‌పై వెళుతున్న ఐదు గేదెలను రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదు గేదెలు మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. కొండపల్లికి చెందిన ఓ వ్యక్తి తన పాడిగేదెలను మేతకోసం ఉదయం పొలం తోలాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చే సమయంలో రైల్వేట్రాక్ దాటుతుండగా ఎన్టీటీపీఎస్ బొగ్గు రవాణాకు ఉపయోగించే రైల్వే గేటు సమీపంలో రైలు ఢీకొట్టింది. రైల్వే ట్రాక్‌పై సుమారు 500 మీటర్ల దూరం చెల్లాచెదురుగా పడిన గేదెలను రైల్వే పోలీసులు తొలగించారు.

నేడు షేర్‌మహ్మద్‌పేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

జగ్గయ్యపేట: మండలంలోని షేర్‌మహ్మద్‌పేట గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రభుత్వ వైద్యులతో పాటు స్పెషలిస్ట్ వైద్యులు రోగులను పరీక్షిస్తారని తెలిపారు.

కౌన్సిలర్ కార్యాలయం ప్రారంభించిన ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని దస్తావేజుల వీధిలో స్థానిక 16 వ వార్డు కౌన్సిలర్ తన్నీరు నాగమణి నూతనంగా ఏర్పాటుచేసిన కార్యాలయాన్ని సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రారంభించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు గుంజ లక్ష్మణ్, కళాకారుల విభాగం జిల్లా అధ్యక్షుడు ఉప్పుతోళ్ల వెంకటేశ్వర్లు, నాయకులు కాశి కిషోర్, తన్నీరు నాగేంద్ర, కుంచపు నారాయణ, వేముల విజయ్, తుమ్మల గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మృతిపై బాధితుల ఆందోళన

మైలవరం: వాహనం ఢీకొని విలువైన గొర్రెలు మృతి చెందాయని, తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు విజయవాడ–ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారి(30వ నంబరు జాతీయ రహదారి)పై సోమవారం రాత్రి ఆందోళనకు దిగారు. మైలవరం యాదవుల బజారుకు చెందిన పీ వెంకటేశ్వరరావు, బి.శివయ్య, సీహెచ్ శ్రీనివాసరావు, బి.నాగరాజు మరి కొంత మంది చంద్రగూడెం సమీపంలోని పొలాల్లో గొర్రెలను మేపుకుని తిరిగి ఇంటికి బయలు దేరారు. జాతీయ రహదారిలోని నాగేంద్రస్వామి ఆలయం వద్ద గొర్రెలను దారి మళ్లించే క్రమంలో రహదారి ఇరువైపులా ట్రాఫిక్‌ను ఆపి గొర్రెలను తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడకు చెందిన ఓ పోలీస్ వాహనం తిరువూరు వైపు వెళ్తుండగా గొర్రెలను ఢీకొంది. ఈ ఘటనలో నాలుగు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా మరో 15 గొర్రెలకు కాళ్లు విరిగాయి. దీంతో గొర్రెల యజమానులు రూ.లక్షల విలువ చేసే తమ గొర్రెలు చనిపోయాయని, తమకు న్యాయం చేయాలని కోరుతూ జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. ఎస్సై హరిప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో చర్చించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కంచికచర్ల: బైక్‌పై వెళుతున్న ఓ వ్యక్తి రోడ్డు పక్కన ఇనుపదిమ్మెను ఢీకొనగా తీవ్రగాయాలైన సంఘటన సోమవారం పట్టణంలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన గోపాలకృష్ణ కంచికచర్లలో తన పనులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా స్థానిక జుజ్జూరు రోడ్డు వద్దకు రాగానే రోడ్డు పక్కన ఇనుపదిమ్మెను బైక్ ఢీకొంది. ఈ ఘటనలో గోపాలకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని వైద్య చికిత్స నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని ముగ్గురు యువకులకు గాయాలు

మక్కపేట(వత్సవాయి): లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం రాత్రి గ్రామ శివారులోని రామాలయం వద్ద జరిగింది. వివరాల మేరకు గ్రామానికి చెందిన నూకపోగు రాజీవ్, యంట్రాతి ప్రవీణ్, పెరుమాళ్లపల్లి రాజా నడుచుకుంటూ చిల్లకల్లు వైపు వెళ్తుండగా, అదే సమయంలో చిల్లకల్లు వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ మూలమలుపు వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి రోడ్డుపై నడుస్తున్న వీరిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో రాజీవ్‌ను మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించగా మరో ఇద్దరికి జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.